

హైదరాబాద్ వార్త

# పెట్టుబడి పేరుతో కోటి రూపాయలకు టోపీ

**లక్ష పెట్టుబడి పెడితే 100 రోజుల్లో డబ్బు రెట్టింపు - బాధితుల ఫిర్యాదుతో ఇద్దరు అరెస్ట్**




పోలీసుల అదుపులో ఉన్న ఖాన్ రియాజ్, సురేష్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** పెట్టుబడుల పేరుతో ప్రజలను నమ్మబలికి కోటి రూపాయలు పెట్టుబడి డబ్బులు కాజేసిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బుల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. టీవీ మెకానిక్‌గా పనిచేసే చిత్తూరు జిల్లా వేంకటగిరి కోటకు చెందిన ఖాన్ రియాజ్ (33) నగరంలోని మణికొండలో నివాసం ఉంటున్నాడు. చిక్కడపల్లికి చెందిన సురేష్ (50)తో కలిసి 2024లో నాగోల్ చౌరస్తా వద్ద మామ మెటల్స్ పేరుతో కంపెనీని ఏర్పాటు చేశారు. ఆ కంపెనీలో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.2వేల లాభం ఇస్తామని, 100 రోజుల్లో డబ్బు రెట్టింపు అవుతుందని, దుబాయ్ నుంచి బంగారం తెప్పించి తక్కువ ధరలో ఇస్తామని పలువురు వినియోగదారులకు ఆకర్షణీయమైన వాగ్దానాలతో అనేక మందిని నమ్మబలికారు. ఇటీవల కాలంలో నిందితులు కనిపించకపోవడంతో మోసపోయిన బాధితులు నాగోల్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

## లోక జననీ నమోనమః







సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దర్శనానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. మహిళలు సాక సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. - ప్రభాతవార్త, బేగంపేట

# బుడ్డోడు..అయినా భయంకరుడు



**విద్యార్థుల్లో క్రూరత్వాన్ని పెంపొందిస్తున్న క్రైమ్ కథలు**

**ఆన్‌లైన్‌లో వెతికి మరీ దొపిడీలు.. హత్యలు**

**సహస్ర హత్య కేసు నిందితుడూ పదిహేనేళ్ల బుడతడు**

**వెబ్‌సిరీస్ చూసి పక్కింట్లో మిషన్ థెఫ్ట్‌కు పక్కా స్కెచ్**

**గ్యాస్ లీక్ చేసి ఇంటిని పేల్చేయాలని ప్లాన్**

**సిసి కెమెరాలకూ దొరకకుండా పథకం అమలు**

**బాలిక కేకలు వేయడంతో పైశాచికతంగా హత్య**

**విద్యార్థుల భవిష్యత్తును బుగ్గి చేస్తున్న సెల్‌ఫోన్లు**



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** స్మార్ట్‌ఫోన్ అనే ఓ పరికరం అనేక అరాచకాలు సృష్టిస్తుంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు స్మార్ట్‌ఫోన్‌కు అడిక్ట్ అయ్యారంటే అతిశయోక్తి కాదు. ఏ చిన్న సందేహం కలిగిన స్మార్ట్‌ఫోన్‌లో శోధించి, సత్వర పరిష్కారం పొందుతున్నారు నేటి ప్రజలు. టెక్నాలజీ పరంగా వీటి వినియోగం బాగానే ఉన్నా.. దీని వాడకం వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతోంది. ఇంట్లో గజిబిజీగా ఉండే తల్లిదండ్రులు తమ పిల్లలను ఆడించడానికి సమయంలేక స్మార్ట్‌ఫోన్‌కు అలవాటు పడేలా చేస్తున్నారు. ఇలా చిన్నారుల కార్టూన్ బొమ్మలతో ప్రారంభమైన సెల్‌ఫోన్ వినియోగం చివరికి క్రైమ్ కిల్లర్స్‌గా మారేలా చేస్తోంది. తాజాగా కూకట్‌పల్లికి చెందిన సహస్ర హత్య కేసు లో నిందితుడి స్టోరీతో పోలీసులు సైతం అవాక్కయ్యారు.

చూడ్డానికి కుర్రాడే.. టెన్త్ క్లాస్ చదువుతున్న వాడే.. బట్.. అతని ఆలోచన విధానం చూస్తే మైండ్ బ్లాంక్ అవుతోంది.. పట్టుమని పదిహేనేళ్లు కూడా లేవు.. ఇన్ని క్రిమినల్ ఆలోచనలా..? అన్న విస్మయం కలుగుతుంది. కూకట్‌పల్లికి చెందిన సహస్ర హత్య కేసులో నిందితుడైన బాలుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. బాలుడి క్రిమినల్ బ్రెయిన్ చూసి పోలీసులు అవాక్కయ్యారు. ముందే పేపర్‌పై స్క్రిప్ట్ రాసుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. దొంగతనం చేయడం ఒక ఆలోచన అయితే.. గ్యాస్ లీక్ చేసి ఆ ఇంటిని పేల్చేయాలన్నది మరో ఆలోచన. ఎటు చూసినా తన పాత్ర బయటకు పొక్కకూడదని చాలా తెలివిగా వ్యవహరించాడు. మరోవైపు సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయి.. అందులో ఏమేం కవర్ అవుతాయో కూడా గ్రహించాడు. అందుకే పోలీసులు ఎన్నిసార్లు సీసీ ఫుటేజ్ తిరగేసినా బాలుడి ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదు. ఓ దశలో పోలీసుల దర్యాప్తు క్లిష్టంగా మారింది. నాలుగు రోజులైనా మర్డర్ మిస్టరీ వీడకపోవడంతో పోలీసులు ఛేదిస్తారా చేతులెత్తేస్తారా అన్న అనుమానాలు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన హింట్ కీలకంగా మారింది. పక్క బిల్డింగ్‌లో కుర్రాడ్ని అదుపులోకి తీసుకుని ఏం చేశావ్.. ఎందుకిలా చేశావ్ అని ప్రశ్నించారు. ముందుగా బుకాయించిన బాలుడు.. ఆ తర్వాత క్రైమ్ సీన్

మిగతా 3లో

# కేబుల్ దాదాలు

**కరెంట్ పోల్స్‌పై ఇష్టారాజ్యం**

**విద్యుత్ శాఖ అనుమతి లేకుండానే వాడకం**

**గ్రేటర్‌లో 20లక్షల స్తంభాలు..**

**అనుమతి తీసుకుంది 1.73లక్షలకే**

**ఎల్‌టి, 11కెవి, 33కేవి పోల్స్‌పై అడ్డగోలుగా వైరింగ్**

**పట్టించుకోని స్థానిక అధికారులు...**

**ప్రమాదం జరిగినప్పుడే హడావిడి**



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన ప్రమాదాలతో కేబుల్ టీవి,ఇంటర్నెట్,కంపెనీల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెతున్నాయి. స్తంభాలపై అనధికారికంగా కేబుల్స్ వేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్న విమర్శలు అటు విద్యుత్‌శాఖ, ఇటు ప్రజల నుంచి వెల్లువెత్తున్నాయి. ఇటీవల రామాంతపూర్‌లో ప్రమాద ఘటన నేపథ్యంలో నగరంలోని విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లపై పెద్దఎత్తున చర్చజరుగుతోంది. ఈనేపథ్యంలో అసలు గ్రేటర్‌లో విద్యుత్ స్థంబాలు ఎన్ని..కేబుల్ టీవి, ఇంటర్నెట్ కంపెనీలు శాఖ అనుతితీసుకుని వాడకుంటున్న స్థంబాలను పరిశీలిస్తే ..గ్రేటర్‌లో విద్యుత్ స్థంబాలు 20లక్షలకుపైగా ఉంటే..అందులో కేవలం 1.73లక్షల స్తంభాలకు మాత్రమే కేబుల్ కంపెనీలు అనుమతి తీసుకుని వాడకుంటున్నాయి. దీంతో ఇటు విద్యుత్‌శాఖ ఆదాయానికి గండిపడటమే కాకుండా అప్పుడప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాస్తవానికి విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం కరెంట్ స్థంబాలపై కేబుల్స్ వేసే ముందు ఆయా సంస్థలు స్తంభాలపై కేబులు కనెక్ట్ చేయాలంటే ముందుగా అధికారుల అనుమతి తీసుకోవాలి. అలాగే ప్రతి స్తంభానికి రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు చెల్లించి కనీసం 15 ఫీట్ల ఎత్తులోనే కేబుళ్లు వేయాలి. అలాగే ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను వేయడం,భద్రతా చర్యలను అమలు చేయడం సదరు ఏజెన్సీదే బాధ్యత. అలాగే ఆయా సంస్థలు తాము అనుమతి తీసుకున్న విద్యుత్ స్తంభాలను సులభంగా గుర్తించేందుకు వాటిపై పెయింటింగ్ తప్పనిసరిగా చేయాలి. అలాగే బ్యాక్‌హాల్ ఎక్విప్‌మెంట్ వంటి అదనపు పరికరాలను ఇన్‌స్టాల్ చేయకూడదు. అలాగే అనుమతించిన సంఖ్యకు మించి స్తంభాలను ఉపయోగించకూడదు. అంతేకాకుండా సమీపంలోని లైన్ల నుండి విద్యుత్ సరఫరాను డైరెక్ట్ ట్యాపింగ్ చేయరాదు.

కాని ఈ నియమాలను ఏ కేబుల్, ఇంటర్నేట్ కంపెనీ పాటించడం లేదు. పైగా ఆయా ప్రాంతాల్లో భారీ వాహనాలు దాటేటప్పుడు తక్కువ ఎత్తులో వేయబడిన కేబుల్స్ వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌కు తీవ్ర నష్టం జరుగుతుంది.

**స్తంభాలు ఎక్కేటప్పుడూ సమస్యలు..**

ఇంటర్నెట్, కేబుల్ టీవి సిబ్బంది 10 అడుగుల లోపలే వైర్లను స్థంభాలకు అమర్చుతున్నారు దీంతో విద్యుత్ సిబ్బంది స్థంబాలు ఎక్కే సమయంలో సమస్యలు తలెత్తుడంతోపాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఆపరేటర్లు కొత్త కనెక్షన్ కోసం స్థంబాలపై కేబుల్ వేస్తున్నారుకానీ అక్కడ వినియోగంలోలేని, పనిచేయని కేబుల్స్‌ను తొలగించట్లేదు. పైగా వాటిని 3 నుండి 4 అడుగుల ఎత్తులో వదిలేస్తున్నారు. అనేక సందర్భాలలో విద్యుత్ సిబ్బంది కేబుల్ బండిల్స్ లో చిక్కుకొని స్తంభం నుండి పడిపోయిన సంఘటనలు వున్నాయి. అలాగే కేబుల్ బండిల్స్‌కు తోడు ఇతర బాక్సులు, సిలిండర్ ఆకారపు పరికరాలు ఇష్టానుసారంగా వేలాడతీయడం వల్ల స్తంభాలు కూడా వంగిపోతున్నాయి.

అనుమతి తీసుకున్న వారు.. తీసుకోని వారు అందరూ ఒకే రకమైన నలుపు రంగు కేబుల్స్‌ను ఉపయోగిస్తుండటంతో ఆపరేటర్‌ను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యుత్ సిబ్బంది తెలుపుతున్నారు. అనుమతి పొందిన కేబుల్స్‌ను సులభంగా గుర్తించడానికి పెయింట్ చేయాలని లేదా ఇతర ప్రత్యామ్నాయాలు చూడాలని సూచిస్తున్నారు.

# ఫుట్‌పాత్‌లున్నది వ్యాపారాలకు కాదు

**అక్రమ నిర్మాణాలు తొలగించి ఖాళీ చేయండి- కమిషనర్ ఆదేశం**



నార్సింగిలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 22 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గిరిగిరిగడ్డ ప్రాంతంలో ఉన్న ఫుట్‌పాత్‌పై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్లే పాదచారులు ఫుట్‌పాత్‌లపై కాకుండా రోడ్డుపై నడువాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో పలువురు పాదచారులు వాహనాలు తగిలి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి వెంటనే ఫుట్‌పాత్‌లపై వెలిసిన అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలన్నింటిని తొలగించాలని టిపిఓ మణిహారికను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో టిపిఓ తన సిబ్బందితో కలిసి శుక్రవారం గిరిగిరిగడ్డ ప్రాంతానికి వెళ్లి జేసీబీతో అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు నిర్మించింది, పాదచారులు నడిచి వెళ్లేందుకని, ఇలా ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు చేసుకునేందుకు కాదని హెచ్చరించారు.

మిగతా 3లో



# ప్రశాంత వాతావరణంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలు

**జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి**

**హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త:** యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలి జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. ఈమేరకు శుక్రవారం కోఠిలోని చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ (మెయిన్స్) పరీక్ష నిర్వహణ సందర్భంగా కలెక్టర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ అభ్యర్థుల హాజరు వివరాలు, పరీక్ష నిర్వహణ తీరు, చేపట్టిన ఏర్పాట్లను ఈ సందర్భంగా తెలుసుకున్నారు. అదేవిధంగా ఏ బ్లాక్ వెన్యూ సూపర్వైజర్ లోక పావని 576 మందికి గాను 560 మంది హాజరు కాగా 16 మంది గైరాజరయ్యారని తెలిపారు. అలాగే 24 పరీక్ష నిర్వహణ గదులలో 29 జామర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ కు వివరించారు. తదుపరి కలెక్టర్ బి బ్లాక్ తనిఖీలో భాగంగా వెన్యూ సూపర్వైజర్ ప్రేమలత 114 మందికి గాను 109 మంది హాజరు కాగా మిగతా 5 మంది గైర్హాజరయ్యారని అలాగే నాలుగు రూమ్స్ లో ఐదు జామర్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓలు వెంకటేశ్వర్లు, బాలు నాయక్, పర్యవేక్షకులు రహీం, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాలాలు, కల్వర్టుల్లో టన్నులకు టన్నుల చెత్త

**నెల రోజుల్లో 27వేల ప్రాంతాల్లో క్లీనింగ్**

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** వర్షం పడినప్పుడు వరద తొలగింపు..మిగతా సమయంలో పూడికను తొలగించడం పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. వర్షాకాలం ఆరంభానికి ముందు నుంచి పూడిక తొలగింపు జరుగుతుండగా మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లు అందుబాటులోకి వచ్చిన జులై 1వ తేదీ నుంచి హైడ్రా కార్యక్రమం మరింత వేగాన్ని అందుకుంది. ఇలా ఇప్పటి వరకూ 15665 క్యాచ్‌పిట్లను హైడ్రా క్లీన్ చేసింది. 359 కల్వర్టులలో పూడికను హైడ్రా తొలగించింది. 1670 చోట్ల నాలాల్లో చెత్తను బయటకు తీసి తరలించింది. ఇలా 4609 వాటర్ లాగింగ్ పాయింట్లను హైడ్రా క్లియర్ చేసింది. వీటికి తోడు.. వర్షాల వేళ 4974 ప్రాంతాల్లోపేరుకుపోయిన చెత్త ను తొలగించింది. ఇలా మొత్తం 27,272 చోట్ల చెత్త, పూడిక తొలగింపు పనులను జులై ఆరంభం నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ చేసింది. హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమాలను నిర్వహించి

మిగతా 3లో

# అక్రమాల సర్కిల్




**అభివృద్ధి పనుల్లో నాణ్యతను నిగ్గుతేల్చాల్సిన విజిలెన్స్ నివేదికలు ఫైళ్లకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ శాఖల్లో అవినీతి బకారులు చెలరేగిపోతున్నారు. తప్పు చేస్తే శిక్ష పడుతుందనే భయం ప్రభుత్వ ఉద్యోగుల్లో లేకపోవడంతో సామాన్యుడు బలవుతున్నాడన్న ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజల నుంచి వివిధ రూపాల్లో ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్న ప్రభుత్వాలు.. కలెక్షన్ కింగ్‌లను తమ ఇష్టానికి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.**

**23 ఇఈ ఆఫీస్‌లో పైసలిస్తేనే పనులు**

**లక్షలు ఖర్చు పెట్టి పోస్టింగ్**

**ఇంజినీరింగ్ పనుల్లో తనిఖీలు శూన్యం**

**భారీగా వసూళ్లకు తెర**

**మూణ్ణాళ్ల ముచ్చటగా అభివృద్ధి పనులు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త:** మూసాపేట సర్కిల్ 23 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఈ) కార్యాలయం అవినీతి అక్రమాలకు నిల యంగా మారింది. ముడుపులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని పలు వురు ఆరోపిస్తున్నారు. ఇఈ కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహి స్తున్న ఓ అధికారి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లక్షలు ఖర్చు పెట్టి పోస్టింగ్ దక్కించుకున్న ఓ అధికారి ఇంజనీరింగ్ పనుల్లో అక్రమాలకు తన వంతు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆయన డిఇలు, కాంట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లకు తెరలేపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కెపిహెచ్‌బి కాలనీ, మూసాపేట, ఫతేనగర్, అల్లాపూర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలకు కాంట్రాక్టర్లు పూర్తిగా తిలోదకాలు ఇస్తున్నారు. అయా ప్రాంతాల్లో వేసిన తారు సిమెంట్ రోడ్డు పనులు మూణ్ణాళ్ల ముచ్చటగా మిగులుతోంది. రోడ్లను తనిఖీ చేసి కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా కాంట్రాక్టర్లపై నిఘా పెట్టవలసిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## కూకట్‌పల్లి నల్లచెరువు

# ఓ పెద్ద పిక్నిక్ స్పాట్..

**ఏడు ఇన్‌లెట్ల ద్వారా చెరువులోకి వర్షం నీరు**

**జీవవైవిధ్యం ఉండేలా ఐలాండ్స్ నిర్మాణం**

**అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్**



**హైదరాబాద్, ఆగస్టు 22:** కూకట్‌పల్లి నల్ల చెరువు వర్షపు నీటితో నిండింది. మంచి నీటితో ఆహ్లాదకరంగా మారింది. మొన్నటివరకు నిర్మాణ వ్యర్థాలతో నిండి.. మురికి కూపంగా మారి.. ఆఖరుకు చెరువు ఆనవాళ్లనే కోల్పోయిన దశ నుంచి.. నేడు సరికొత్త జలాశయంగా మారింది. కేవలం నాలుగు నెలల్లో చెరువు రూపురేఖలు మారిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండలా కనిపిస్తోంది. అక్కడ నివాసం ఉన్న వాళ్లే ఆశ్చర్య పడేలా కూకట్‌పల్లి నల్ల చెరువు తయారయ్యింది. గొలుసుకట్టు చెరువులతో వరదను నివారించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్న హైడ్రా సిబ్బందిలో ఆత్మవిశ్వాశాన్ని నింపింది. గురువారం నల్ల చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించి అభివృద్ధి పనులను పర్యవేక్షి ంచారు.

**చెరువు విస్తీర్ణం రెట్టింపు..**

కూకట్‌పల్లి నల్ల చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయి 16 ఎకరాలుగా మిగిలిపోయింది. రెవెన్యూ, గ్రామ రికార్డులు, చెరువుకు సంబంధించిన సమాచారంతో ఆక్రమణలను తొలగించే పనిని హైడ్రా చేపట్టింది. చెరువులోకి జరిగి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన 16 వ్యాపార షెడ్డులను హైడ్రా తొలగించింది. చెరువులో పోసిన నిర్మాణ వ్యర్థాలతో పాటు దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించడమే కాకుండా.. 4 మీటర్ల లోతు మట్టిని కూడా తొలగించింది. దీంతో ఇప్పుడు చెరువు విస్తీర్ణం దాదాపు రెట్టింపు అయ్యింది. కేవలం 4 నెలల్లో 28 ఎకరాల మేర చెరువు తయారయ్యిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇంతలోనే వర్షాకాలం వచ్చి ఒకటి

మిగతా 3లో

# అష్టలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఎల్.బి.నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం ప్రాంతం మొత్తం శ్రావణ శుక్రవారం సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. బంగారు దోతిలో శ్రీమన్నారాయనుడు, బంగారు చీరలో ఆదిలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామిని దర్శించుకోవడానికి స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. దేవాలయం ప్రాంగణంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, అర్చనలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు జరిగాయి.





అమ్మవారి దర్శనానికి తరలి వచ్చిన భక్తులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారి దర్శనం అనంతరం వేలాదిమంది భక్తులకు అన్న సత్రంలో అన్న ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పటిష్ట ఏర్పాట్లను చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందొబస్తు కూడా ఏర్పాటు చేశారు.



కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌లో కార్వాన్ డివిజన్ బిజెపి నేతలు

## అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

మెహిదీపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని కార్వాన్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఉద్దడి జగదీష్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బిజెపి రాష్ట్ర పార్టీ సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తే బిజెపి నేతలను ముందస్తుగా అరెస్టులు చేయడం తగదన్నారు. ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న కార్వాన్ డివిజన్ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ కుమార్ నాయకులు గంజి రఘునాథ్, వెంకటేష్‌లను కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌కు, గుడిమల్కాపూర్ డివిజన్‌లోని బిజెపి స్థానిక డివిజన్ అధ్యక్షులు తాళ్ల రాజేష్, దళిత ముచ్చ అధ్యక్షులు మామిడి వెంకటేష్, నాయకులు వెంకటేష్ జ్యూసీలను నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## నేడు జస్టిస్ రాధారాణికి ఆంధ్రకేసరి పురస్కారం

రవీంద్రభారతి, ఆగస్టు 22 ప్రభాతవార్త : తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణికి ఈనెల 23న ఆంధ్రకేసరి స్మారక పురస్కార ప్రదానం చేయనున్నట్లు శ్రీ కమలాకర ఛారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి సాహిత్య రూపకం ప్రదర్శన ఉంటుందన్నారు. శనివారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళావేదికలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరవనున్నారని వివరించారు.



మ్యూజికల్ నైట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రంగారావు తదితరులు

## 30న హిందీ గాయని సంగీత మెలెకర్ మ్యూజికల్ నైట్

నాంపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త : ఈ నెల 30న ది వాయిస్ ఆఫ్ ఇండియా శీర్షికన ముంబయికి చెందిన ప్రముఖ హిందీ గాయని సంగీత మెలెకర్ మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారని పొత్తూరి రంగారావు తెలిపారు. బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో సాయంత్రం 5గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సాంస్కృతిక సంస్థ కళాదర్బార్ ఆధ్వర్యం వహిస్తుంది.

## సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతాం

చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త: ప్రజా సమస్యలను తుంగలో తొక్కుతూ ప్రజా సంక్షేమాన్ని ఎండగట్టే విధంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి ప్రభుత్వ పనితీరును ఖండిస్తూ బిజెపి ఆందోళన కొనసాగుతుందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. శుక్రవారం సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న సందర్భంగా ఆమెతో పాటు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ నివాస గృహం వద్ద ముషీరాబాద్ పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేసారు. దీనిపై ఆమె మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలు హౌస్ అరెస్టులు తమ ప్రజా పోరాటాన్ని ఆపలేవన్నారు.



గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశమైన ఏసిపి సుబ్బయ్య

## నవరాత్రి వేడుకలు కలిసి మెలిసి చేసుకోండి

కంటోన్మెంట్, ఆగస్టు 22 ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని గోపాలపురం ఏసిపి సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం తుకారాంగేట్, మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో ఆయన సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, వర్గ విబేధాలు లేకుండా ప్రతి ఒక్కరు కలిసి మెలిసి ఉండి గణేష్ నవరాత్రి వేడుకలను జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పని సరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మారేడ్‌పల్లి సిఐ నోముల వెంకటేష్, గోపాలపురం సిఐ మధుకుమార్‌లతో పాటు పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 24న త్యాగరాయ గానసభలో వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త: నెల 24 వ తేదీన చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన ఆడిటోరియంలో కాపు, బలిజ, తెలగ, మున్నూరు కాపు, సామాజిక వర్గాల వారి కోసం వివాహ పరిచయ వేదిక ఏర్పాట్లు చేస్తున్నట్లు వేదిక స్థాపకుడు ఏ కోటేశ్వర రావు పత్రికా విలేకరులకు తెలిపారు. మధ్యవర్తులు కమిషన్ వంటి వాటికి దూరంగా ముఖా ముఖిగా మాటాడుకుని సంబంధాలు కుదుర్చుకోవచ్చని అయన తెలిపారు. ఈ వేదికలో పాల్గొన తలచిన వారు మ్యాక్సీ సైజ్ ఫోటోతో దరఖాస్తు ఫారంలో పేరు నమోదు చేసుకోవాన్నారు. దూర ప్రాంతాల్లో ఉండి వేదికకు రాలేని వారు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 22వ తేదీలోగా 9398314847 నంబరును సంప్రదించి నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద నమోదు చేసుకోవచ్చని వివరించారు.

### తాకట్టు పెట్టిన బంగారంతో

# వ్యాపారి పరార్

### ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు

### మీడియా ముందు బాధితుడి ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త: తాకట్టు పెట్టిన బంగారం, వెండితో ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో గల ముకేష్ జైన్ పాన్‌బ్రోకర్స్ వద్ద గోపాల్‌నాయక్ అనే వ్యక్తి రెండున్నర తులాల బంగారం, అర కేజీ వెండి ఆభరణాలు తాకట్టు పెట్టారు. మార్చిలో విడిపించుకోవడం కోసం బాధితుడు సదరు వ్యాపారి వద్దకు వెళ్లగా ఆభరణాలు బ్యాంక్ లాకర్‌లో ఉన్నాయంటూ బుకాయించాడు. అనంతరం నెల రోజుల తర్వాత వ్యాపారాన్ని తన బాబాయ్ బాబులాల్ జైన్‌కు అప్పగించి ముకేష్ ఉడాయించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. నగలను లాకర్ నుంచి తెచ్చిన తర్వాత ఇస్తానని అతని బాబాయ్ బాబులాల్ జైన్ కాలయాపన చేస్తున్నాడని బాధితుడు వాపోయాడు. నెలలు గడుస్తున్నా ఆభరణాలు ఇవ్వకపోవడంతో గత జూన్ 24న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తాకట్టు పెట్టిన సొమ్ము విలువ రూ.3 లక్షలు వరకూ ఉంటుందన్నారు. వ్యాపారి వద్ద సొమ్ము తాకట్టు పెట్టిన రసీదులు తదితర ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. అయితే, ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ గోపాల్‌నాయక్ మీడియాను ఆశ్రయించారు. వెంటనే ముకేష్‌జైన్, బాబులాల్‌జైన్‌లపై కేసు నమోదు చేసి, తనకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## అంబర్‌పేటలో రూ. 13 కోట్లతో అభివృద్ధి పనులు

హైదరాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలో 13 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. వీటిన్నంటినీ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. శుక్రవారం గోల్నాక డివిజన్ లంక బస్తీలో రూ.12 లక్షలతో నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం లంక బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అవసరమైన ప్రతి చోట నూతన సీసీ రోడ్లు, డ్రైనేజ్ పైప్ లైన్లు వేస్తామని హామీ ఇచ్చారు. పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం శ్రీధర్ రెడ్డి, ఎఈ రోహిత్, జిహెచ్ఎంసి ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, తిరుపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, అంబికా, వెంకట్, శివకుమార్, బిఆర్ఎస్ బుచ్చిరెడ్డి, సంతోష్ కుమార్ మల్లేష్,ఉమా, సుమతి,దేవేందర్, ప్రభాకర్, చారి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అసైన్డ్ భూములు మంజూరు చేయాలి

సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త: శ్రమశక్తిపై ఆధారపడి జీవిస్తున్న రైతు కూలీలు, కార్మిక వర్గానికి రాష్ట్రంలోని పోడు, పంచరాయి, అసైన్డ్ భూములను ప్రభుత్వం తక్షణమే పంపిణీ చేయాలని తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలకోటి రామన్న, బందెల యాదగిరి, మహిళా విభాగం అధ్యక్షురాలు చిలుముల్ల సుజాత డిమాండ్ చేశారు. సమాఖ్య ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్మికుల సదస్సులో వారు ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతాంగానికి యూరియాను సరఫరా చేయాలని, వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు, అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని, అలాగే ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం రంగ సంస్థలు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని, గ్రామీణ పేదలకు 3 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని, పేద కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్‌లు, ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలని వారు కోరారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించకపోతే ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు యాతాకుల ఈశ్వర్, వెల్పుల వెంకటసాయి, కన్న కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమార్కుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త: తమ ఫిర్యాదుల మేరకు జిహెచ్ఎంసిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న 8 మంది ఛైర్‌మెన్స్ (మున్షిలను) బదిలీ చేయడం పట్ల దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పడి నవీన్ కుమార్ హర్షం వ్యక్తంచేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడ్డ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు చిలకపాటి సుశీల్‌రాజ్, శివకుమార్, మధుసూదన్‌రావు, బి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ కార్డులతో ఉచితంగా కార్పొరేట్ చికిత్స

### బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏవిఆర్ మూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏవిఆర్ మూర్తి అన్నారు. శుక్రవారం న్యూ మారుతీ నగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆయుష్మాన్ కార్డులను ఉచితంగా డౌన్లోడ్ చేసి అందించారు. ఈ సందర్భంగా ఏవిఆర్ మూర్తి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా ప్రభుత్వ వైద్య శాలలతో పాటు కార్పొరేట్ వైద్యశాలల్లో కూడా ఐదు లక్షల వరకు ఉచితంగా ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందని ఇది పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ కార్డులను 272 మంది ఉచితంగా పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్చార్జి నరసింహులు తోపాటు బ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీ సభ్యులు శ్రీనివాస్ సోమేశ్వరులు శిరీష శైలజ ఆనంద్ సురేష్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

## 30న పద్యకవి లగడపాటికి కిన్నెర ఆరుద్ర పురస్కారం

చిక్కడపల్లి, ఆగస్టు 22,ప్రభాతవార్త: కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో అభ్యుదయ కవి, పరిశోధకులు, నవగ్రంధ చరిత్ర రచయిత డాక్టర్ ఆరుద్ర శత జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని పద్య కవి, పరిశోధకులు డాక్టర్ లగడపాటి సంగయ్యకు కిన్నెర ఆరుద్ర పురస్కారాన్ని బహూకరించనున్నట్లు నిర్వహణ సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం వివరించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 30న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆరుద్ర సినీ సంగీత విభావరిలో గాయని గాయకులు డి.ఏ.మిత్ర, వై.ఎస్. రామకృష్ణ, బాలకామేశ్వర్ రావు, వి.ఏ. లక్షి ్మ, సురేఖ మూర్తి, గంటి శైలజ తదిత రులు గానం చేస్తారని చెప్పారు.

## సమ సమాజ నిర్మాణ లక్ష్యంగా రచనలు ఆహ్వానం

రవీంద్రభారతి, ఆగస్టు 22, ప్రభాతవార్త : సామాజిక సమరసతా నిర్మాణం లక్ష్యంగా ఉండే రచనలను ఆహ్వానిస్తున్నామని సామాజిక సమరసత కళాసాహితీ మండల్ని ప్రతినిధులు తెలిపారు. కులవివక్ష, అంటరానితనం వంటి దురాచారాల నిర్మూలన, ఏ కులాన్ని అవమానించకుండా అందరినీ కలుపుకుపోయే విధంగా సానుకూల సందేశం ఉండాలన్నారు. రాష్ట్రంలోని కవులు, రచయితలు బుర్రకథ, వీధినాటకం, లఘునాటిక, గొల్లసుద్దులు, ఒగ్గుకథ, ఏకపాత్రాభినయం, జానపదగేయాలు, సాధారణ పాటలు, రామాయణం, భారతం, భాగవతం తదితర అంశాల ఆధారంగా కుల, జాతి, వర్ణ భేదం లేకుండా భగవంతుడు ఎలా అందరినీ కరుణించాడో చూపుతూ రచనలు ఉండాలన్నారు. తమ రచనలను మంగళంపల్లి శ్రీహరి, రోడ్‌నంబరు 6, భీంరెడ్డినగర్, బోడుప్పల్, హైదరాబాద్-98 చిరునామాకు పంపాలని సూచించారు. రచనలు ఎ4 సైజు పేపరులో ఒకవైపు 20లైన్లకు మించకుండా సెప్టెంబరు 6వ తేదీలోగా చేరేటట్లు పంపాలని కోరారు. ఉత్తమంగా ఎంపికైన వాటికి ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ప్రచురించినవి అనర్హం అని స్పష్టం చేశారు.

## ఐటీ మంత్రి శ్రీధర్‌కు అభినందన



మంత్రి శ్రీధర్ బాబును సత్కరిస్తున్న కాంగ్రెస్ నేత రాజేశ్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్

కంటోన్మెంట్, ఆగస్టు 22, ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్ యాదవ్, శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏసిపి యాదగిరి

## ఐదు ఫీట్ల ఎత్తు దాటితే నెక్లెస్ రోడ్డులో నిమజ్జనం

ముషీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త: వినాయక నిమజ్జనం కోసం ఐదు ఫీట్ల ఎత్తు విగ్రహాల వరకు ఎన్టీఆర్ స్టేడియంలోను, అంత కన్నా ఎక్కువ ఎత్తు ఉంటే నెక్లెస్ రోడ్డులోను ఏర్పాటుచేస్తున్నామని ఏర్పాటు చేస్తున్నామని గాంధీనగర్ ఎసిపి యాదగిరి తెలిపారు. శుక్రవారం దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండప నిర్వాహకులతో బండమైసమ్మ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమాట్లాడారు. మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. సమావేశంలో సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎసిపి శంకర్‌రెడ్డి

## ఉత్సవ చందాలు బలవంతంగా వసూలు చేయొద్దు

పేట్ బషీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ గణేష్ ఉత్సవాలు అంటేనే యూనిటీ ఐక్యతకు నిదర్శనం అని మేడ్చల్ డివిజన్ ఎసిపి శంకర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమా గార్డెన్‌లో గణేష్ ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్‌లో ఉత్సవ కమిటీలకు పోలీసులు పలు సూచనలు చేశారు. మండపాలు మూడు ఫీట్లు ఎత్తు ఉండాలని, నిమజ్జనం రోజు ఫిట్నెస్ ఉన్న వాహనంలో లైసెన్స్ ఉన్న మంచి డ్రైవర్‌ను ఏర్పాటు చేసి విగ్రహాలు తరలించాలన్నారు. డీజేలు పెట్టొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సూరారం సిఐ, సుదీర్ కృష్ణ, ఎస్ఐలు, మురళి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## బిసి బిల్లుపై పార్లమెంట్‌లో మాట్లాడరేం?

### బిసి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపించిన బిల్లులపై ఏఒక్క రాజకీయ పార్టీ ఎంపీ కూడా పార్లమెంట్లో మాట్లాడలేదని అన్ని రాజకీయ పార్టీలు బిసిలను మోసం చేస్తున్నాయని బిసి సంక్షేమ సంఘా జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో 42 శాతం బిసి రిజర్వేషన్లకు మద్దతు ప్రకటిస్తూ తెలంగాణ దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసిన బిసి బిల్లును, స్థానిక సంస్థల ఆర్డినెన్స్ బిల్లును ఆమోదించకుండా కేంద్రం సుప్రీంకోర్టును అగౌరవపరిచిందన్నారు. రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రకారం వాటా దక్కాలంటున్న రాహుల్ గాంధీ, బిసి ప్రధాని అని చెప్పుకొనే మోదీ బిసి రిజర్వేషన్ల బిల్లులపై పార్లమెంట్లో మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీకి బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే 300 మంది ఇండియా కూటమి ఎంపిలతో మోదీ ఇంటి ముందు దర్నా చేయాలని డిమాండ్ చేశారు. 10శాతం ఉన్న అగ్రవర్ణాల పాలనకు 90శాతం ఉన్న బహుజనులంతా ఫుల్ స్టాఫ్ పెట్టాలని, ఇందుకు ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. బత్తుల చంద్రం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో నేతలు వనం రమేష్ సునీల్, కూతాడి రవికుమార్, సదానందం. బాస్కరచారి, లింగంగౌడ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కార్ఖానలో ట్రాఫిక్ ఎసిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిసిపి రాహుల్ హెగ్డే

## క్రమశిక్షణతో విధులు నిర్వహించండి

కంటోన్మెంట్,ఆగస్టు 22 ప్రభాతవార్త: పోలీసులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ చట్టాలను గౌరవించాలని ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే సూచించారు. శుక్రవారం కార్ఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలను నడపడం చట్టరీత్య నేరమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, నార్త్‌జోన్‌ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, రఘునాథ్, మధుబాబు, నవీన్, జానకిరామ్‌లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కృషి

హైదరాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏఐసిసి ప్రకటించడం పట్ల కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫోరం నేషనల్ సెక్రటరీ డాక్టర్ పివి.రవిశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వెంగళరావు నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి తెలంగాణ కోసం పోరాటం చేసిన వ్యక్తి అని సామాజిక న్యాయం, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణలో ప్రత్యేక గుర్తింపు పొందారని అటువంటి వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి అన్ని విధాలుగా అర్హులని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించడం సమంజసమైనదని డాక్టర్ రవి శేఖర్ రెడ్డి అన్నారు.



ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

## సిసి రోడ్డు పనుల వేగం పెంచండి

బేగంపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త: బేగంపేట డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రకాశంనగర్‌లో 30లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రెయినేజీ లైన్లు పొంగి పొర్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే కొట్టివేయాలన్నారు. వివిధ బస్తీల్లో వీధిలైట్లు వెలగడం లేదని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలన్నారు.



రసూల్‌పురాలో పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభించిన అనంతరం స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## నీటి ఎద్దడి నివారణకు పవర్ బోర్‌వెల్

కంటోన్మెంట్, ఆగస్టు 22, ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం 2వ వార్డు రసూల్‌పురా సిల్వర్ కంపౌండ్ డబుల్‌బెడ్‌రూమ్ కాలనీల్లో 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పవర్‌బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో పవర్‌బోర్‌వెల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.నరేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేసిన అనంతరం సిఈఓ మధుకర్ నాయక్‌ను సత్కరిస్తున్న మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, దేవుడు తదితరులు

## కారుణ్య నియామకాలను వెంటనే భర్తీ చేయాలి

కంటోన్మెంట్, ఆగస్టు 22, ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి రేన్ కోట్స్ వంటి కిట్స్‌ను పంపిణీ చేయాలని, అదే విధంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పనిచేసి సర్వీస్‌లో మృతి చెందిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న తల్లుల సంఘం ప్రతినిధులు

## పాఠశాలల కమిటీలను కొనసాగించాలి

కంటోన్మెంట్, ఆగస్టు 22, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పాఠశాల యాజమాన్య కమిటీలను యధా విధిగా కొనసాగించాలని తల్లుల సంఘం, బాలలహక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సి.ఆర్.పి.ఎఫ్. జిల్లా కార్యదర్శి లక్ష్మి నారాయణ, తెలంగాణ ఫేరెన్స్ అసోసియేషన్ ఎం.అజయ్ బాబు, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు మెరుగుర్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, శోభ, పి.ఎల్.నప్రవీణ్, స్వర్ణ,లత తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

## డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

కంటోన్మెంట్, ఆగస్టు 22 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లోని వివిధప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బోయిన్ పల్లి నేతాజీ నగర్ కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్య టించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నర్సింహ్మారావ్, అనీల్ యాదవ్, విజయ్ యాదవ్, శేఖర్, ప్రసాద్ రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సికింద్రాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త : చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీ పక్కన బుధవారం 27 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా సిబ్బంది గాంధీ ఆస్పత్రిలో చేర్చాడు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నలుపు రంగు టీషర్ట్, నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైలార్‌గడ్డలోని ఓ స్వీట్ షాప్‌వద్ద మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని 65 సంవత్సరాల వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఆరెంజ్ కలర్ టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని పోలీసులు తెలిపారు.

## పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిదీ



అన్నదానంలో పాల్గొన్న బిజెపి నాయకులు

చార్మినార్,ఆగస్టు 22 ప్రభాతవార్త : పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీనియర్ బిజెపి నాయకులు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సంఘ సేవకులు గోపాల శంకరయ్య యాదవ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని సిటీ కళాశాల చౌరస్తాలో అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయ కులు

## వేగవంతంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బలాల



అజంపురాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల అబ్రార్ తదితరులు

**మలక్ పేట, ఆగస్టు 22, ప్రభాతవార్త:**
మలక్ పేట్ నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులను చేపట్టాలని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ లోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. చంచల గూడలో చేపట్టిన పట్టణ ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి నిర్మాణం పనులను, రోడ్డు నిర్మాణం పనులను ,విద్యుత్ స్తంభం ఏర్పాటు పనులను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. అదేవిధంగా మూసా నగర్ లో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే బలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జున్, మహేష్, నాయకులు అబ్రర్, అలీం తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా బొక్కా మధుసూదన్ రెడ్డి



బొక్క మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న వంజరి వినోద్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 22, ప్రభాతవార్త:**
భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా ముసారాంబాగ్ డివిజన్ చెందిన సీనియర్ బిజెపి నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి నియమితుయ్యారు. భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బొక్క మధుసూదన్ రెడ్డిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్ కుమార్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొక్క మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భాగ్యనగర్ జిల్లా లో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్ కోటేశ్వరరావు, నాయకులు రాజు ముదిరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహకారం



బాధితులకు నగదు అందిస్తున్న శ్రీధర్ గౌడ్

**హయత్ నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:**
హయత్ నగర్ డివిజన్ లోని రంగనాయకుల గుట్టలో నివసించే కందనమోని శివకుమార్ ఇంట్లో గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్థానిక నాయకులు ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయా యి. శివకుమార్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్ శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సమాచారన్ని ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి తెలపగా ఆయన తక్షణ సహాయంగా 10 వేల రూపాయల నగదును శివకుమార్ దంపతులకు పంపించారు. అనంతరం హయత్ నగర్ మండల రెవిన్యూ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ యూత్ ప్రెసిడెంట్ డ్యాగల రాకేష్ కుమార్, నాయకులు పిట్టల లక్ష్మణ్ ముదిరాజ్, తొండ వెంకటేష్, రవి నాయక్, విష్ణువర్ధన్, మధు, మనోజ్, వీరన్న పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై సెక్రటేరియట్ ముట్టడించిన కార్పొరేటర్

**నేరెడ్ మెట్, ఆగస్టు 22:ప్రభాతవార్త**
నగరంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సేవ్ హైదరాబాద్ పేరుతో సెక్రటేరియట్‌ను ముట్టడించారు. మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ హైడ్రా, జీహెచ్ఎంసీ, టీజీఎస్ పిసిడిఎల్, వాటర్ వర్క్స్ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షం పడితే చాలు నగర రహదారులు నీటి గుంతలతో నిండిపోతున్నాయని, ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే, త్వరలోనే వాటర్ బోర్డు, విద్యుత్ బోర్డు, జీహెచ్ఎంసీ కార్యాలయాలను కూడా ముట్టడిస్తాం" అని శ్రవణ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నందు యాదవ్, మురళి గౌడ్, నాని, చెన్నారెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, వివేక్, షాగంటి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మాల బస్తీలో డ్రైనేజీ పనులు : రజితరెడ్డి



ఉప్పల్ మాల బస్తీలో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ మాల బస్తి రూ.92 లక్షలు తో జరుగుతున్న డ్రైనేజ్ నిర్మాణ పనులు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఖమె మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్టుగా పేర్కొన్నారు.డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా తెలిపారు.ఉప్పల్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నేతలు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,అలుగుల అనిల్, బూత్కూరు మదన్ గౌడ్, కిషోర్ ,సంజీవ, రవి, నర్సింగరావు, వేణు, పద్మారావు, దశరత్, బాబు, నవీన్,కుమార్, శ్రీను, ఎల్.నవీన్ కిషోర్,తదితరులు పాల్గొన్నారు

## మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ప్రజాసేవకు పాతర !

- -క్షేత్రస్థాయి పనుల పేరుతో విధులకు డుమ్మా
- -గంటల తరబడి పడిగాపులు
- -వెనుదిరుగుతున్న ప్రజలు
- -పనివేళల్లో కునుకు తీస్తున్న సిబ్బంది



సర్కిల్ కార్యాలయంలో ఖాళీ కుర్చీ దర్శనం ఇస్తున్న దృశ్యం



పనివేళలో కునుకు తీస్తున్న సిబ్బంది

**నేరెడ్ మెట్, ఆగస్టు 22,ప్రభాతవార్త.**
ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా నిలవాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ఇక్కడి కీలకమైన ఇంజనీరింగ్ విభాగం సహా పలు విభాగాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తుండగా, అధికారుల జాడ మాత్రం కనిపించడం లేదు. ఫీల్డ్ వర్క్ అనే సాకుతో... ఉదయం పదిన్నర గంటలకు కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభం కావాల్సి ఉండగా, మధ్యాహ్నం అయినా పలువురు అధికారులు తమ సీట్లలో ఉండటం లేదు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులైతే ఎప్పుడు కార్యాలయానికి వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇదేమిటని ప్రశ్నిస్తే “ఫీల్డ్ వర్క్‌కు వెళ్లాం“ అనే సిద్ధంగా ఉన్న సమాధానం వినిపిస్తోంది. క్షేత్రస్థాయి పర్యటనలు వారి విధుల్లో భాగమే అయినప్పటికీ, కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో కనీసం ఒక్కరైనా విభాగం మొత్తం ఖాళీగా ఉండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రణాళిక లేకుండా అందరూ ఫీల్డ్ వర్క్ పేరుతో బయటకు వెళ్లడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గృహ నిర్మాణ అనుమతులు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, ఇతర ఫిర్యాదుల కోసం వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది ప్రజలు సర్కిల్ కార్యాలయానికి వస్తుంటారు. అయితే, ఇక్కడకు వచ్చాక అధికారులు అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. గంటలు గడిచినా అధికారులు రాకపోవడంతో చేసేదేమీ లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొందరు సిబ్బంది అయితే పనివేళల్లోనే కుర్చీల్లో కునుకు తీస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన, సత్వర సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల తీరు దానికి తూట్లు పొడుస్తోంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంపై దృష్టి సారించి, బయోమెట్రిక్ హాజరును కఠినంగా అమలు చేయాలని, సమయపాలన పాటించని, విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రవీంద్రసాగర్ చేసిన అసత్య ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం : కార్పొరేటర్



మాట్లాడుతున్న కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**నాచారం, ఆగస్టు 22 ప్రభాతవార్త :** మల్లాపూర్ బీజేపీ నాయకుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఇటీవల మీడియా సమావేశంలో తనపై చేసిన అస్యఆరోపణలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయపై పరువునష్టం దావావేయబోతున్నట్లు మల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో తన తోటి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మిడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ 1968 లో గోకుల్ నగర్ కాలనీ లేఅవుట్ చేసిన వారి వారసులు ప్లాట్ నెంబరు 300 ని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు.దీనిపై 6 నెలల క్రితం నాచారం పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నంబర్ 783/2024 అయ్యిందన్నారు. కె. ప్రేమమ్మ, భుఖ్య శ్రావణ్ కుమార్, బదుగు శ్రీకాంత్ ల పైన ఫిర్యాదు చేయడం జరిగిందిని వెల్లడించారు. ఇది తెలిసికూడా రవీంద్ర సాగర్ మనుషులు 31 జనవరి 2025 నాడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రిజిస్ట్రేషన్ శాఖలో ఈసీ సర్టిఫికెట్ తీయగా 1968 నుండి మొదలుకొని 30 అక్టోబర్ 2023 వరకు ఎలాంటి లావాదేవీలు లేవన్నారు. ఇది తెలుసుకొని వారు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు.తాను జిఎచ్ఎంసి కార్పొరేటర్ గా రెండవసారి ఎన్నికై 10 సంవత్సరాలుగా ప్రజలకు నిస్వార్థంగా సేవా చేస్తున్న, దీన్ని జీర్ణించుకోలేక 2020 లో కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఇండిపెండెంట్ ప్రత్యర్థి సంగిశెట్టి రవీంద్ర సాగర్ అనే వ్యక్తి నా పైన నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.తనను రాజకీయంగా ఎదుర్కోలేక, తన ప్రతిష్టను దెబ్బతీసే ఆలోచనతోనే ఆధారం లేని ఆరోపణలు చేశారని అన్నారు.ఈ క్రమంలో నాకు 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నానని, లేకుంటే రవీంద్రసాగర్‌పై పరువునష్టం దావా వేస్తానని చెప్పారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఎవరైనా గతంలో ప్లాట్లు కొన్న యజమానులు వారి ప్లాట్లు కబ్జాకు గురైతే, నన్ను సంప్రదిస్తే సరైన న్యాయం చేస్తానని, భరోసానిస్తానని ప్రెస్ మీట్లో తెలిపారు.ఇటీవల నకిలీ పత్రాలు సృష్టించి, వైట్ కలర్ నేరాలు ఎక్కువైన నేపథ్యంలో. ఇట్టి నేరాలు జరుపుతున్న వారు ఎవరైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉన్నవారిని వదిలేదన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో బేటి అయిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం రాష్ట్ర రోడ్లు ,భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో బేటి అయ్యారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రిని కలిసి ఉప్పల్ ప్రధాన రహదారితో జరుగుతున్న పనుల విషయంపై చర్చించారు.ఉప్పల్ ప్రధాన రహదారిలో ఎలివేటెడ్ కారిడార్‌లో రహదారి పనులు ప్రారంభమయ్యాయని, కారిడార్‌తోపాటు కింద రహదారి విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో పాటు వెంటనే కారిడార్, కింద రహదారి పనులను చేపట్టాలని అదేశించారని తెలిపారు. గతంలో పనులు మొదలు పెట్టాలని జీహెచ్ఎంసీ అదేశించారని, తాజాగా ఆర్ అండ్ బీ శాఖల అధికారులకు ఆదేశించడంతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులను చేపట్టి ఏడేళ్లు దాటిందని, ఇప్పటి వరకు సగం కూడా పనులు కాలేదన్నారు. మరోవైపు కింద రహదారి ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలు పడి అధ్వానంగా మారిందని, ఈ రెండు రకాల పనులను సమన్వయంతో సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని ఆర్ అండ్ బీ ఆదేశించడంతో పనులు చకచక సాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాపై చూపుతున్న అభిమానం వెలకట్టలేనిది : సబితా ఇంద్రారెడ్డి



అభిమానులతో కలిసి పాటల ఆడియో వీడియో ఆవిష్కరణ చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** గడచిన దశాబ్దాన్నర కాలానికి పైగా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సేవలో ఉంటూ అలుపెరుగకుండా వారి సంక్షేమానికి ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబిత ఇంద్రారెడ్డిపై ఆమె అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన ఆడియో, వీడియో ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. మహేశ్వరం మండల మాజీ కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఆదిల్ అలీ, సీనియర్ నాయకుడు వెంకటరాజిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కాడమోని ప్రభాకర్‌ల సహకారంతో ఎన్.అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ గాయని ప్రభ ఆలపించిన ఆడియో, వీడియోను క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అభిమానుల సమక్షంలో సబితారెడ్డి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై చూపుతున్న అభిమానం వెలకట్టలేనిదని అన్నారు. అభిమానమే ఊపిరిగా ప్రజా సేవను కొనసాగిస్తూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సామ మహేందర్‌రెడ్డి, సుశీలారెడ్డి, సునీతా బాలరాజ్, గీత, నిర్మలారెడ్డి, వాసు బాబు, అర్కల కామేష్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, పల్లె జంగయ్యగౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, సిల్వేరి సాంబశివ, యాతం పవన్ యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాదరి రమేష్ పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు డిప్యూటీ సిఎం, మంత్రులకు ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబులను ఆహ్వానిస్తున్న అమరేందర్‌రెడ్డి, పారిజాత, కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలాల్లో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేషుడిని దర్శించుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన ముఖ్య నేతలు, గణేష్ ఉత్సవ సమితి వారు డిప్యూటీ సిఎం, పలువురు మంత్రులను కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, నాయకులు ఎర్ర జైహింద్, బాల్‌నింగని జంగయ్య, టేకుల శశిధర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, టేకుల సుధాకర్‌రెడ్డి, తూళ్ళ నరహరి గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



చలో సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన ఉప్పల్ బిజెపి నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు దృశ్యం.

## జాతీయ జెండా సమిష్టి,ఐక్యతను సూచిస్తుంది : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



జాతీయ జెండా ర్యాలీలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు.

**వనస్థలిపురం ఆగస్టు.22.ప్రభాతవార్త**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని లోటస్ లాప్ స్కూల్ దగ్గర లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన 2500 ఫిట్ల జాతీయ జెండా ర్యాలీ కార్యక్రమంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా దేశ సార్వభౌమాధికారాన్ని,గౌరవాన్ని,మరియు సమష్టి ఐక్యతను సూచిస్తుంది.భారీ జెండాలు ఈ భావనలను మరింత ప్రభావవంతంగా తెలియజేస్తాయి.భారీ జాతీయ జెండాలను ఎగురవేయడం ద్వారా దేశభక్తిని పెంపొందించవచ్చు.మరియు ప్రజలలో ఐక్యతా భావనను కలిగించవచ్చు అని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరపు దయనంద్ గుప్తా,ఉప్పల శ్రీనివాస్ గుప్తా,మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్,ఉద్యమకారులు దూసరి మధు గౌడ్,సంజయ్,ముద్దగోని సతీశ్ గౌడ్ మరియు వనస్థలిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందకిషోర్, దూరయ్య,రవీందర్ రెడ్డి,నర్సింహులు,సువిధ,నీరజ్,భాస్కర్ పలువురు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్, సుధీర్ రెడ్డి, అమర్ సింగ్ జగదీశ్వర్ రెడ్డి, కృష్ణ గౌడ్ తదితరులు

**మేడిపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త;**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంఘం హోటల్ ఆవరణంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిల్లు, చేతి కర్రల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ,పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్,బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, పిర్జాదిగూడ మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుమల జగదీశ్వర్ రెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ , వెంకటేష్ గౌడ్, మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల అజయ్ కుమార్ రెడ్డి పాల్గొని వికలాంగులకు ట్రై సైకిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిటిఏ ప్రతినిధులు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



**మల్కాజిగిరి ఆగస్టు22,ప్రభాతవార్త :**
గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని రామాంజనేయ నగర్ లో 16 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆర్సీసీ పైపులైన్ నిర్మాణ పనులను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా అన్నపూర్ణ సొసైటీ శివగంగా రామాంజనేయ నగర్ తదితర ప్రాంతాలలో మహేంద్ర హిల్స్ నుంచి వచ్చే మురుగునీటితోపాటు వర్షాకాలంలో వర్షపు నీరు పొంగిపొర్లి కాలనీలలో ప్రవహించడంతో ఆ సమస్య పరిష్కారానికి ఆర్సీసీ పైపుల నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి, నాయకులు మేకల రాము యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బైరు అనిల్ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### వీది దీపాలు, వీది కుక్కల సమస్యపై అధికారులకు ఫిర్యాదు




ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డు పటేల్

**సైదాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వాణి నగర్, పూర్ణోదయ కాలనీతో పాటు పలు కాలనీలలో స్ట్రీల్ లైట్స్ సరిగ్గా పనిచేయక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని హైద్రాబాద్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డు పటేల్ ప్రజావాణిలో డిప్యూటి కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. వీది దీపాల సమస్యతో పాటు వీది కుక్కలు విచ్చల విడిగా కాలనీలలో సంచరిస్తుండడంతో చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీది దీపాలు లేకపోవడం వల్ల చైన్ స్నాచింగ్స్, దొంగతనాలు జరుగుతున్నాయని అన్నారు. వీది దీపాలు, వీది కుక్కల సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోట్ల లడ్డు పటేల్ అధికారులను కోరారు.



హైదరాబాదులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన కార్పొరేటర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

## మల్కాజిగిరి సర్కిల్‌లో పురాతన భవనాల కూల్చివేత

### ప్రమాదకరంగా ఉన్న 20 కట్టడాలపై చర్యలు

### ఎసిపి బాల శ్రీనివాస్

**నేరెడ్ మెట్, ఆగస్టు 22,ప్రభాతవార్త**
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల నగరాన్ని ముంచెత్తుతున్న భారీ వర్షాల కారణంగా, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యగా ప్రమాదకరంగా మారిన కట్టడాలను తొలగించే ప్రక్రియను నిర్వహిస్తున్నామని పట్టణ ప్రణాళికాధికారి బాల శ్రీనివాస్ తెలిపారు. సర్కిల్ పరిధిలో సుమారు 20 ఇళ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఈ భవనాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, వాటిని కూల్చివేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఇప్పటికే సైనిక్‌పురి, బీజేఆర్ నగర్, మల్కాజ్‌గిరి, జేఎల్ఎస్ కాలనీ వంటి పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, వాటిలో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి, ఆ కట్టడాలను తొలగిస్తున్నామని తెలిపారు. కేవలం ఇళ్లే కాకుండా, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీ గోడలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాత భవనాలు మరింత బలహీనపడి, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని గుర్తించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకే ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు , ప్రజలు తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మాజీ మేయర్ బిజెపి రాష్ట్ర నాయకులు హౌస్ అరెస్ట్



మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డితో మాట్లాడుతున్న ఓ.యూ ఇన్స్పెక్టర్ అప్పల నాయుడు

**తార్నాక, ఆగస్టు 22 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి అసమర్ధ పాలనతో హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని మాజీ మేయర్ బిజెపి రాష్ట్ర నాయకురాలు బండ కార్తీక చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమర్ధ పాలనను నిరసిస్తూ శుక్రవారం బిజెపి తలపెట్టిన సేవ్ హైదరాబాద్ పేరుతో చలో సెక్రటేరియట్ కార్యక్రమం నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తార్నాకలోని కార్తీక చంద్రారెడ్డిని ముందస్తుగా ఇంటివద్ద అరెస్టు చేశారు. యూనివర్సిటీ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని బిజెపి నాయకులు బయటకు వెళ్లకుండా కట్టడం చేశారు. ఈ సందర్భంగా కార్తీక రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి వద్దనే ఉన్న మున్సిపల్ శాఖ నగర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలం చెందుతుందని ఆరోపించారు. వెంటనే దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హౌస్ అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి,శివారెడ్డి వీరన్న, కిరణ్ గౌడ్, కొన్నె సంపత్, భూపాల్ రెడ్డి,చరణ్ రాజ్,లడ్డు, కేదార్, రాజ్ కుమార్, చిన్న, కృష్ణ తదితరులుపాల్గొన్నారు.

## రాజా బహదూర్ అందరికీ ఆదర్శం



వెంకట్రావురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బద్దూరి వెంకటేశ్వరరెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** కొత్వాల్‌రాజా బహద్దూర్ వెంకట్రామా రెడ్డి జీవితం అందరికీ ఆదర్శమని రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కొత్వాల్‌రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి 156వ జయంతి ఉత్సవాలు రెడ్డి సంఘం తెలంగాణ కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. బహదూర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం రెడ్డి సంఘం ప్రధానకార్యదర్శి తోడేటి నర్సిహ్మారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ సామ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బుస్సు సుధాకర్‌రెడ్డి, రెడ్డిసంఘం తెలంగాణ ఆర్గనైసింగ్ సెక్రటరీ ఎన్నేపల్లి లింగారెడ్డి, మహిళా అసోసియేట్ ప్రెసిడెంట్ సుమతిరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు వెంకట్రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీశైలంరెడ్డి, తాడిసేన సురేందంరెడ్డి, పిండి నర్సిహ్మారెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, తీగల మాధవరెడ్డి, ఆర్‌బివిఆర్ఆర్ రెడ్డి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అరెస్టులు చేసి బిజెపి పోరాటాన్ని ఆపలేరు



అరుణ సురేందర్‌యాదవ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులు, అరాచక చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార పాలనకు నిదర్శనమని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు నిర్వహించబోతున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్‌ని ఆమె నివాసంలో నాగోల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్దంగా నిర్వహించే కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరైనదికాదని, అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు మా పోరాటం ఆగదని హెచ్చరించారు. పోరాటమే మా శక్తి అని ప్రజలే మా బలం అన్నారు. బీజేపీ నాయకులు రావుల శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌రెడ్డి, మహిళా నాయకులు రుపాలిసింగ్ తదితరులను కూడా పోలీసుల అరెస్టు చేశారు.



నూతనంగా ఏర్పాటైన ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు,కాలనీ అధ్యక్షుడు పన్నాల తులసీరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే